క్లుప్తంగా

నేల కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: నేల కాలుష్యం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి అన్నారు. అంతర్జాతీయ (మృత్తిక) నేల దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని నాగులాపల్లి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేలతల్లిని ప్రతి రైతు నమ్ముకోవాలన్నారు. పంటల సాగులో రసాయనిక ఎరువులను వేయడం ద్వారా నేల దెబ్బతింటుందన్నారు. నేలలో భూసారం తగ్గుతుందన్నారు. తద్వారా ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమన్నారు. వీఏఏలు అనూష, పవన్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘పల్లె వనం-వనం మనం’కు స్థల పరిశీలన



పాటిపల్లిలో పల్లె వనం కోసం స్థలం పరిశీలిస్తున్న అధికారులు, ప్రతినిధులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి పంచాయతీ సర్వే నంబర్ 80లో ప్రభుత్వ స్థలాన్ని గురువారం పల్లెవనం-వనం మనం కార్యక్రమానికి పరిశీలించారు. ఈ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటేందుకు అనువైన స్థలం ఎంపిక చేసినట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో శివ తెలిపారు. మండల వ్యాప్తంగా వనం మనం కార్యక్రమంలో స్థలం ఎంపిక కోసం పలు ప్రాంతాలను గుర్తించామని, అయితే పాటిపల్లిలో స్థలం అన్ని రకాలుగా అనువైందన్నారు. పంచాయతీ నాయకుడు త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి తేజ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల బహూకరణ



పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి: మండలంలో బోయపాడు ప్రాథమిక, వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు హెటిరో కంపెనీ యాజమాన్యం కంప్యూటర్లను బహూకరించింది. సీఎస్‌ఆర్ నిధులతో సమకూర్చిన ఈ కంప్యూటర్లను గురువారం కంపెనీ డీజీఎంలు రాజారెడ్డి, కుల్లాయి రెడ్డి, సుబ్బారెడ్డి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల వివరాల నమోదు, రికార్డుల కంప్యూటరీకరణ, శిక్షణకు ఈ కంప్యూటర్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, హెచ్‌ఎం మూర్తిరాజు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నెల 13 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు



జిల్లా మహాసభల పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

యలమంచిలి రూరల్: ఈ నెల 13వ తేదీ నుంచి రెండ్రోజుల పాటు యలమంచిలిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు మైలపల్లి బాలాజీ తెలిపారు. గురువారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద మహాసభల పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విడుదల చేశారు. దాదాపు పదేళ్ల తర్వాత యలమంచిలిలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య నిర్వహిస్తున్న జిల్లా మహాసభలను అందరూ జయప్రదం చేయాలని ఆయన కోరారు. మహాసభల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చిస్తామని, వాటి పరిష్కారానికి దశలవారీ పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ యలమంచిలి డివిజన్ కార్యదర్శి కె.మణికంఠ, నాయకులు రవి, రాము, అజయ్ రాజు, సునీల్, కృపానంద రాజేశ్వరి, లహరి, లలిత, అలేఖ్య, భవానీ, జ్యోతి పాల్గొన్నారు.



కొత్తపోలవరం కొండపై ఇళ్ల స్థలం కోసం తవ్విన కొండ

కొండలపై పచ్చ నేతల కన్ను

యథేచ్ఛగా మట్టి, రాయి తవ్వకాలు
ఎస్.రాయవరం మండలంలో జోరుగా అక్రమ రవాణా

ఎస్.రాయవరం: కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల కన్ను మండలంలో ఉన్న కొండలపై పడింది. తవ్వకాలకు కాదేది అనర్హం అన్నట్లుగా రాత్రి పగలూ తేడాలేకుండా యథేచ్ఛగా కొండలను పిండి చేసేస్తున్నారు. గ్రావెల్ మట్టి, రాళ్లు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గుడివాడలో గ్రామానికి ఆనుకుని మినీ రుషికొండ, పెదగుమ్ములూరులో మేడకొండ, జేవీపాలెం, వేమగిరి గ్రామాల్లో రంగనాయకులు కొండ, దార్లపూడి గ్రామంలో పోలవరం కాలువ తవ్వకాల్లో గ్రావెల్, చిన ఉప్పలంలో సముద్రతీరాన్ని ఆనుకుని ఉన్న కొండపై, పెద ఉప్పలం గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండ, ఇలా గ్రావెల్ ఎక్కడ కనిపిస్తే అక్కడ తెలుగు తమ్ముళ్లు సహకారంతో కొండలను పిండి చేసి తవ్వకాలు చేస్తున్నారు. విషయం తెలిసి మండల అధికారులు వెళ్లి అడ్డుపెడితే.. మా నాయకులతో చెప్పి పనులు చేసుకుంటున్నామని, ఉన్నతాధికారులతో తాము మాట్లాడుకున్నామని ఎదురు తిరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇలా ముందుగా తవ్వకాలు చేపట్టిన తరువాత చదునుగా మారిన కొండ భూములను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చిన ఉప్పలం, పెద ఉప్పలం గ్రామాల్లో చేపల చెరువులు, ఇతర వ్యవసాయ భూములుగా మార్చుకుని సాగు చేసుకుంటున్నారు. ఇలా గ్రావెల్ రవాణాదారులకు అడ్డూ అదుపులేకుండా పోతుందని పలువురు విమర్శలు చేస్తున్నారు. **ఇదంతా హోం మంత్రి అనిత ఇలాకాలో జరగడం వల్ల అధికారులకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి అనే విధంగా మారిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో**వడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పొక్లెయిన్లు ఉపయోగించి పట్టపగలు కొండలు, గ్రావెల్ దొరికే ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి, అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలపై క్రిమినల్ కేసులు



మండలంలో మైనింగ్ స్థాయిలో ఎవరూ తవ్వకాలు చేపట్టలేదు. కొండలు తవ్వుకుని ఇళ్ల స్థలాల కోసం ఆక్రమణలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. అనుమతులు లేకుండా మట్టి, రాయి తరలిస్తున్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలు చేపట్టే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– జి.రమేష్‌బాబు, తహసీల్దార్, ఎస్.రాయవరం మండలం



జేవీపాలెంలో కాలువ పేరుతో గ్రావెల్ తరలించుకుపోయిన దృశ్యం



కొండ భూములు ఆక్రమణలు కోసం తవ్వకాలు చేపట్టిన దృశ్యం

బుచ్చిరాజుపేటలో చెరువు పనుల ప్రారంభం



బుచ్చిరాజుపేటలో చెరువు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు

నక్కపల్లి: మండలంలో బుచ్చిరాజుపేటలో చెరువు అభివృద్ధి పనులను సర్పంచ్ కాళ్ల శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్ గురువారం ప్రారంభించారు. చెరువు అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చెరువు అభివృద్ధితో వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, రైతుల కష్టాలు తీరుతాయన్నారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ పనులు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గట్టెం గణేష్, నాయకులు మనబాల కొండబాబు, లోవరాజు, దేవుళ్ల కె.గోవిందు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఇరుముడులతో స్వాములు

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు కట్టుకున్నారు. అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు తమ దీక్ష పూర్తి చేసుకొని శబరిమలతో పాటు ఇతర పుణ్యక్షేత్రాల్లో ఇరుముడులతో వెళ్లి మాలలు విరమించడం ఆనవాయితీ. ఈ ఏడాది మండల పరిసర గ్రామాల్లో మాలలు ధరించిన భక్తులు గురువారం మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో దీక్షా విరమణ చేశారు. దీంతో అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

పాఠశాల అభివృద్ధికి ‘గైల్’ సహకారం

కోటవురట్ల: పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి గైల్ కంపెనీ సహకారం మరువలేనిదని మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ కృషితో పాఠశాల అభివృద్ధికి గైల్ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులు రూ.23 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. గైల్ కంపెనీ పైపులైన్ తమ గ్రామం మీదుగా ఉండడంతో పలు దఫాలుగా తమ గ్రామ అభివృద్ధికి కంపెనీ యాజమాన్యం నిధులు మంజూరు చేస్తోందన్నారు. గతంలో ఆ కంపెనీ నిధులు రూ.7 లక్షలతో గ్రామంలో 22 సోలార్ లైట్లు వేసినట్టు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ పదో తరగతి వరకు తమ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో చదివారని, తన ఉన్నతికి కారణమైన పాఠశాల అభివృద్ధికి పలువిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు.



పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్

మునగపాక హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల తోడ్పాటు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమవంతు సాయం అందజేసి అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ క్రమంలో హైస్కూల్‌కు అవసరమైన సరస్వతి విద్యా వేదికను ఈ ఏడాది ఆగస్టు 15న అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి గతంలో ఇచ్చిన హామీ మేరకు వేదికకు రూఫ్ టాప్ ఏర్పాటు చేశారు. వేదికతో పాటు రూఫ్ ఏర్పాటుకు మొత్తం రూ.2.20 లక్షల మేర ఖర్చు చేసినట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. గురువారం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావును కలిసి ఇకపై హైస్కూల్‌లో జరిగే కార్యక్రమాలను వేదికపై నిర్వహించాలని పూర్వ విద్యార్థులు ఆదారి సూర్య చంద్రరావు, మాడెం జోగారావు, మారిశెట్టి అనంద్, తదితరులు కోరారు.



హైస్కూల్‌లో సరస్వతి విద్యా వేదికకు రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు

121 మందికి నేత్ర వైద్య పరీక్షలు

మునగపాక: మునగపాకలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. జిల్లా అంధత్వ నివారణ, విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ దుర్గాభవాని వైద్య సేవలందించారు. 121 మంది రోగులకు పరీక్షలు చేయగా.. 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ణయించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాభవాని మాట్లాడుతూ కంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ అమృత, మళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దుర్గాభవాని

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన

కోటవురట్ల: పాములవాకలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్థక శాఖల సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శనను గురువారం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ పి.హరిప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిల్లాడ సాయి, ఎంపీటీసీ సభ్యుడు కిల్లాడ వెంకటలక్ష్మి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహక అధికారి డాక్టరు బెహరా ప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ బెహరా ప్రసాదరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యాన్ని 60 శాతం రాయితీపై అందిస్తున్నారని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెట్ల నరేష్ మాట్లాడుతూ వ్యాధికారక సూక్ష్మ క్రిములలో వృద్ధి చెందుతున్న క్రిమి సంహారక ఔషధాల నిరోధకతపై పాడి రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. 31 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసినట్టు తెలిపారు. ఈ శిబిరంలో 42 లేగ దూడలు సందడి చేసి, ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్, రైతు వేచలపు భాస్కరనాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పాములవాకలో లేగదూడలను పరిశీలిస్తున్న కార్యనిర్వాహక అధికారి ప్రసాదరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఏఈ గోపీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మునగపాక, మంగళవరపుపేట, వాడ్రాపల్లి, రాజుపేట, మల్లవరం, కొత్త నాగవరం, పాత నాగవరం తదితర గ్రామాల్లో చెట్ల తొలగింపులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని గోపీకృష్ణ కోరారు.

పాయకరావుపేట: పాయకరావుపేట 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలోని 11కేవీ రాజుగారిబీడు, 11 కేవీ పాయకరావుపేట ఫీడర్ల పరిధిలో లైన్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మంగవరం రోడ్డు, గొల్లల పేట, రాజుగారిబీడు, బీడీవో లేఅవుట్, పీఎస్‌ఆర్ నగర్, కరణంగారి వీధి, కుమ్మరివీధి, పెద్దపీర్ల పంజా, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా నాగుల చవితి

మునగపాక: మండల వ్యాప్తంగా నాగులచవితి నెల పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గత నెల క్రితం జరిగిన నాగులచవితిని పలు కారణాల వల్ల చేసుకోని కుటుంబాలు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు, చిమిడి వేసి నాగేంద్రుడిని మొక్కుకున్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ఎస్.రాయవరం: కర్రివానిపాలెంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాస మొదటి గురువారం పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సు వివరాలు తెలుపుతున్న తహసీల్దార్ ఆది మహేశ్వరరావు

మునగపాక: రైతుల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు జరుగుతాయన్నారు. 6న మెలిపాక, 7న చెర్లోపాలెం, 9న నరేంద్రపురం, 10న మడకపాలెం, 11న చూచుకొండ, 12న టి.సిరసపల్లి, 13న నాగవరం, 16న ఉదయం గణపర్తి, మధ్యాహ్నం చల్లమల, 17న రామభద్రపురం, 18న పల్లపు ఆనందపురం, 19న కుమారపురం, 20న తిమ్మరాజుపేట, 21న పురుషోత్తపురం, 23న అరబుపాలెం, 24న నాగులాపల్లి, 26న మల్లవరం, 27న వెంకటాపురం, 28న జేపీ అగ్రహారం, 30న తోటాడ, 31న వాడ్రాపల్లి, జనవరి 2న మునగపాక, 3న పాటిపల్లి, 4న కాకరాపల్లి, 6న రాజుపేట, 7న ఉదయం ఒంపోలు, మధ్యాహ్నం ఉమ్మలాడ, 8న గంటవానిపాలెం గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యలమంచిలి రూరల్: మండలంలో రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ వరహాలు తెలిపారు. శుక్రవారం బయ్యవరం, ఈ నెల 9న తురంగలపాలెం, 10, 12 తేదీల్లో యలమంచిలి పట్టణం, 13, 16 తేదీల్లో ఎర్రవరం, ఈ నెల 17న కొక్కిరాపల్లి, 18న పీఎస్‌ఆర్ పేట, 19న తెరువుపల్లి, 20న జంపపాలెం, 21న పులపర్తి, 23, 24 తేదీల్లో రేగుపాలెం, 26న ఏటికొప్పాక, 27న కృష్ణాపురం, 28న సోమలింగపాలెం, 30న గొల్లగుంట, కట్టుపాలెం గ్రామాల్లో జరగనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జి.రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు 6న లింగరాజుపాలెంలో సదస్సు జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రీసర్వే ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించామని, వాటిలో పెండింగ్ ఉంటే ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రాజకీయ చైతన్యంతోనే రాజ్యాంగం పరిరక్షణ

పాయకరావుపేట: రాజకీయంగా మరింత చైతన్యవంతులు కావడం ద్వారానే రాజ్యాంగాన్ని పరిరక్షించుకోగలమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సనాతన ధర్మమా? సమధర్మమా అనే అంశంపై పట్టణంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మంపై చర్చ ఎక్కువగా జరుగుతుందని, ఉప ముఖ్యమంత్రి స్వయంగా సనాతన ధర్మాన్ని కాపాడతానని ప్రకటించడం ఈ చర్చకు మరింత ప్రాధాన్యత వచ్చిందన్నారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి కేవలం ఒక మతాన్ని భుజాన ఎత్తుకోవడం రాజ్యాంగబద్ధంగా ఎంత వరకు సమంజసం అనే అంశం కూడా చర్చకు వచ్చిందన్నారు. అంబేడ్కర్ ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగం అన్ని రంగాల్లోను దళితులు, బహుజనులు, మైనార్టీలు, మహిళలకు సమానత్వం కల్పించిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

పేకాట శిబిరంపై దాడి

ఎస్.రాయవరం: మండలంలో జేవీపాలెం శివారులో కొండపై గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.9,600 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మూలపర్రలో వేధిస్తున్న తాగునీటి సమస్య



బావి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

నక్కపల్లి: అమలాపురం శివారు మూలపర్రలో తాగునీటి ఎద్దడి వేధిస్తోంది. 8 రోజుల నుంచి రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీరు సరఫరా కావడం లేదని, అయినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారం రోజులు నుంచి దూరంగా ఉన్న బావుల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టి, తాగునీటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లలిత ఫెర్రో కంపెనీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లోని లలిత ఫెర్రో అల్లాయీస్ కంపెనీ కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నేత ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంపెనీలకు లాభాలు వచ్చినప్పుడు కార్మికులకు పంచరని, అదే విధంగా నష్టాలు వచ్చినప్పుడు జీతాలు ఎందుకు నిలుపుదల చేస్తున్నారని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయం చేసే విషయంలో సంబంధిత శాఖ స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.